క్లుప్తంగా

పత్రికా దినోత్సవం

చండ్రుగొండ: జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని చండ్రుగొండలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జర్నలిస్టులను శాలువాలతో సత్కరించారు. సమాజంలో జర్నలిస్టుల పాత్రను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, టి.సురేష్, ఫజల్‌బక్ష్ దారం గోవింద్‌రెడ్డి, బొర్ర సురేష్, సీనియర్ జర్నలిస్టులు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రఫీక్, సైదయ్య, మధు, కోటాచారి, జ్యోతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీని బదిలీ చేయండి

మణుగూరుటౌన్: తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీని బదిలీ చేయాలని, లేకుంటే సమ్మె నిర్వహిస్తామని ఏఎన్‌ఎంలు డాక్టర్ నిశాంత్‌కి శనివారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండారుగూడెం వెల్‌నెస్ సెంటర్‌కి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు దశాబ్దాలుగా పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను చిన్నచూపుతో ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. స్థాయిని మరచి డాక్టర్ల కుర్చీల్లో కుర్చుని ఏఎన్‌ఎంలకు ఆర్డర్లు వేస్తోందని అన్నారు. ఆమెను వేరే ప్రాంతానికి బదిలీ చేయకపోతే సోమవారం నుంచి ఏఎన్‌ఎంలు విధులు బహిష్కరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సమ్మె చేస్తామని తెలిపారు. ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గొంది వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లించాలి

మణుగూరురూరల్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఏరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని సీఐటీయు జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 32నెలల ఏరియర్స్‌ను మున్సిపల్ కార్మికుల ఇవ్వాల్సి ఉండగా నేటికి చెల్లించకపోవడం దారుణమన్నారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొడిశాల రాములు, సీఐటీయూ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, రమా, నరసింహారావు, సాయమ్మ పాల్గొన్నారు.

27న బీఆర్ఎస్ సమావేశం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకుడు మానె రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ముందు పట్టణంలో బైక్ ర్యాలీ ఉంటుందని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆకోజు సునీల్ కుమార్, పూర్ణచంద్రరావు, నరసింహారావు, రామకృష్ణ, కృష్ణ, ఏడుకొండలు, నాగరాజు, యువరాజు, సూరిబాబు, బాబి, పృథ్వీ, ప్రదీప్, వర్మ, నాగేశ్వరరావు, నాగరాజు, ప్రియాంక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగలితోగు గ్రామానికి చెందిన సర్ప ప్రసాద్ శనివారం తన స్వగ్రామంలో బంధువుల కర్మలను ముగించుకొని మద్దులగూడెంలోని తన అత్తగారింటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పద్మాపురం గ్రామ మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాక ప్రధాన కూడలిలో ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు బెల్లంకొండ వాసుదేవరావు కోరారు. శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐటీసీ పీఎస్‌పీడీకి డ్యూటీకి వెళ్లి వచ్చే కార్మికులకు, ఇతర వర్గాల ప్రజలకు ప్రధాన కూడలిలో రోడ్డు దాటేందుకు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన వివరించారు. సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చారు.

రేగా హయాంలోనే అభివృద్ధి

అశ్వాపురం: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హయాంలోనే మండలంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు రద్దు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ వీరభద్రం, నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, కొల్లు మల్లారెడ్డి, కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నక్కనబోయిన పాపారావు, మేడవరపు సుధీర్, చుంచు రామ్మూర్తి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గతమెంతో రుచికరం!

- నాడు విస్తరాకుల్లో బంతి భోజనం
- ఆ పద్ధతిలోనే ఆరోగ్యం, అభిరుచి
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఉపాధికి ఊతం



పారెటాకులతో విస్తర్లు అల్లుతున్న మహిళ



విస్తర్ల తయారీకి ఉపయోగించే పారెటాకు చెట్ల తీగెలు



అల్లిన విస్తరాకులు..

సండే స్పెషల్

గుండాల: నాడు ఏ పండుగొచ్చినా.. ఏ కార్యమైనా.. ప్రసాదం, అన్నం లాంటివి ఏవైనా..ఆకుల్లో తినడమే ఆనవాయితి. అలా ఆస్వాధించిన పదార్థాల రుచే వేరు. దీని విషయమై మన పెద్దలూ ఇప్పటికీ చెప్పుతూనే ఉంటారు. కానీ నేడు అరిటాకు, మోదుగు ఆకు, పారెటాకు, అడ్డాకు ఇలా రకరకాల ఆకుల్లో భోజనం కంటికి కనిపించడం లేదు. ఎక్కడో పుణ్యక్షేత్రాల వద్ద ఇచ్చే ప్రసాదాల్లోనో..అన్నదానం చేసే దగ్గరనో కనిపిస్తుంటాయి. నేడు ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగంతో ఆ ఆకులు పల్లెల్లో అంతరించిపోతున్నాయి. సహజమైన ఆకులు లభించే చెట్లను సాగు చేయడం, విస్తర్ల అల్లికలతో ఉపాధి పెరగడంతోపాటు నాటి సహజ పద్ధులు తిరిగి జీవం పోసుకుంటాయి.

నాడు ఏ కార్యమైనా..

పల్లెల్లో నాడు ఏ కార్యమైనా విస్తరాకులు కావాలంటే ఓ పనిగా ఉండేది. వారం రోజుల ముందుగానే అడవికి వెళ్లి విస్తర్లుకు సరిపడా పారెటాకులు తెచ్చేవారు. ఆ ఆకులను ఎండబెట్టే వారు. తర్వాత నానబెట్టిన ఆకులను చీపురు పుల్లలతో విస్తర్లు అల్లేవారు. ఇంటికి వచ్చిన బంధువులు ఊరి జనంతో కలిసి ఆ విస్తారులోనే బంతి భోజనం చేసేవారు.

దీనివల్ల సహజసిద్ధ భోజనంతోపాటు విస్తరలు అల్లేవారు ఉపాధి పొందే వారు. 50 ఆకులు, 100 ఆకుల వరకు కట్టలు కట్టి నిలువ ఉంచి విక్రయించేవారు. పల్లెల నుంచే పట్టణాలకు ఆకు విస్తర్లు తీసుకెళ్లి అమ్ముకునేవారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం ఆ ఆకులోనే ఇవ్వడం ఇప్పటికీ జరుగుతుంది. అక్కడక్కడ అరటి ఆకుల్లో భోజనం వడ్డిస్తున్నారు.

ప్లాస్టిక్ రాకతో..

ప్లాస్టిక్‌ను నిషేధించాలనే స్పృహను మరచి దాన్నే తరుచుగా వినియోగిస్తున్నాం. నేడు మార్కెట్‌లో ప్లాస్టిక్ లేనిదే వ్యాపారం లేదు. ప్లాస్టిక్ వాడకం ఎంత ప్రమాదకరమో పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ వాటిని విడిచింది లేదు. వివిధ రకాల ప్లేట్లు ఆకర్షణీయంగా తయారు చేస్తూ మార్కెట్‌లోకి తీసుకురావడమే ప్రజలు వాటికి అలవాటుపడటానికి కారణం.

ఉపాధి కల్పిస్తే మేలు..

అంతరిస్తున్న ఆ విస్తర్లు గల చెట్లను సాగు చేయడం, విస్తర్లు అల్లడం లాంటి ఉపాధి కల్పిస్తే మేలు జరుగుతుందని, ఆరోగ్యాలను కాపాడు కోవచ్చునని పెద్దలు చెబుతున్నారు. వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు పారెటాకు, అడ్డాకులు, మోదుగు ఆకుల గల చెట్లను పెంచేందుకు అవకాశం కల్పించాలని పల్లె ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికీ అడవీ మార్గంలో ఎక్కడో ఓ చోట చెట్లు కనిపిస్తున్నాయి. పెరిగిన పోడు వ్యవసాయంతో ఆ చెట్లు అంతరించి పోతున్నాయి. ఆ విస్తర్ల అల్లికలతో మళ్లీ పాత రోజులను గుర్తు చేసుకోవచ్చు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరుటౌన్: పేదలు ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం వల్ల నష్టాల పాలవుతారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం 100 పడకల ఆస్పత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మారుతి నర్సింగ్ కాలేజీ లయన్స్ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స పూర్తి చేసుకున్న 41 మందికి మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహించగా.. ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, నేత్ర వైద్య సహాయకులు గంజికుంట్ల సంజీవరావు, వైద్యులు గౌరీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ సైదులు, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్, కొర్సా ఆనంద్ తదితరులు ఉన్నారు.



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నూతన కమిటీ ఎన్నిక

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా నాయకులు అన్నవరపు కనకయ్య, కొక్కెరపాటి పుల్లయ్య పర్యవేక్షణలో మండల కమిటీ ఎన్నికను ఏకగ్రీవం చేశారు. మండల కార్యదర్శిగా మోరంపూడి శ్రీనివాసరావుతో పాటుగా 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, మోరంపూడి పాండురంగారావు, పిల్లి నాయుడు, వాడే రత్తమ్మ, కేశవరావు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాలల సింహగర్జన ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్‌ను మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 1న హైదరాబాద్ జింకాన గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన ఆత్మ గౌరవ సభకు మాలలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డేగల వంశి, డేగల శివ, పద్మారావు, శ్రీను, కృష్ణ, వంశి, రాము, వెంకటేష్, చంద్రం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలనలో కాంగ్రెస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

దమ్మపేట: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. శనివారం మండల పరిధిలోని పార్కలగండి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేగా కాంతారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేకపోగా ఎన్నికల హామీల అమలులో కూడా వైఫల్యం చెందిందని అన్నారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లాకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. గ్రామ స్థాయిలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని, వారికి పార్టీ అండగా ఉంటుందని అభయం ఇచ్చారు. నాయకులు సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, దొడ్డా రమేష్, తూతా నాగమణి, గాజుబోయిన యేసు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్: కార్మికుల న్యాయమైన డిమాండ్లను మెనేజ్‌మెంట్ వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. శనివారం పెండింగ్‌లో ఉన్న పెరక్స్‌పై ఇన్‌కంటాక్స్‌ను కంపెనీ చెల్లింపు, ఎస్–1, ఎస్–2 ప్లేడే పీహెచ్‌డీ విధానం తొలిగింపు, ఏ–గ్రేడ్ ఎక్విప్‌మెంట్‌పై పనిచేస్తున్న ఆపరేటర్లకు ప్రమోషన్లు, నూతన 250 క్వార్టర్ల నిర్మాణం చేపట్టడం తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌ల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనేజ్‌మెంట్ వెంటనే స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీల్లో వీధి లైట్లు మెరుగుపరచడంతో పాటు అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మేకల ఈశ్వర్, జి.పుల్లారావు, గోలి గంగాధర్‌రావు, నంబూరు శ్రీనివాసరావు, కుమారస్వామి, రవి, ఆంథోని రవికుమార్, సాయి ప్రకాశ్‌చారి, పాపారావు, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, నాగభూషణం, ఈసం శ్రీను, చారి, విజయ్‌కుమార్, చొప్ప సుధాకర్, వీఆర్‌ఎం రెడ్డి, రమేష్, అక్బర్ అలీ, వలి, జానకి ప్రసాద్, త్రినాథ్ తదితరులు ఉన్నారు.

కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆవరణలో ఈ నెల 18వ తేదీన కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే కోటి దీపోత్సవం కార్యక్రమానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా నిర్వహకులు, అర్చకులు మేడూరి సాంబశివ ప్రసాద్ మాట్లాడుతూ..శ్రీరాజరాజేశ్వరి సమేత త్రిగుణేశ్వర స్వామి వారికి, చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించేందుకు సాయంత్రం 6గంటల సమయంలో 'సహస్ర లింగార్చన సహిత కోటి దీపోత్సవం' నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి భక్తులంతా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని, భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు.



కోటి దీపోత్సవ కార్యక్రమానికి సిద్ధం చేసిన ఆవరణ

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదే గ్రామంలో ఇటీవలే మృతి చెందిన మహాదేవ వీరభద్ర చారి చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ప్రెస్‌క్లబ్ సభ్యులకు సన్మానం

అశ్వారావుపేటలో నూతనంగా ఎన్నికైన అశ్వారావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యాక్షులు, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శాలువాతో సన్మానించారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ మర్యాద పూర్వకంగా కలవగా.. ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను క్లబ్ సభ్యులు కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టి.అప్పారావు, ఉపాధ్యాక్షుడు ఎండి.ముజాఫర్ ఖాన్, కార్యదర్శి ఎస్‌కె.వలీపాషా, కోశాధికారి చీమకుర్తి రవికిరణ్, మాజీ అధ్యక్షుడు హరీష్, సీనియర్ పాత్రికేయులు షేక్.మౌలాలి, చీమకుర్తి శ్రీనివాసరావు, పి.రామారావు, ఎమ్.రాము, మడిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న శత జయంతి ఉత్సవాలు

దుమ్ముగూడెం: హైదరాబాద్ గాంధీభవన్‌లో ఈ నెల 20న జరిగే సేవాదళ్ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని భద్రాచలం నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షుడు పిలక వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉత్సవాలకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నారని, భద్రాచలం నియోజకవర్గం ఏ బ్లాక్, బీ బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బ్రహ్మయ్య

అశ్వాపురం: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో శనివారం డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం చేపడుతూ అక్కడి నియోజకవర్గంలో పార్టీ ప్రచార కార్యక్రమాన్ని బ్రహ్మయ్య పరిశీలన చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఇటీవల రూ.కోటితో నిర్మించిన డ్రెయినేజీ అస్తవ్యస్తంగా నిర్మించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించడంతో డ్రెయినేజీతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కోల్‌మైన్స్ యూనియన్ అధ్యక్షుడిగా జాన్



మణుగూరురూరల్: ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఏరియా అధ్యక్షుడిగా వెలగపల్లి జాన్ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ బలోపేతానికి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టియుసి ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, తెలంగాణ మినిమం వేజేస్ అడ్వైజరి బోర్డ్ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌లకు, సహకరించిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

25న సీపీఎం మహాసభలు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 25వ తేదీన జరిగే సీపీఎం అశ్వారావుపేట మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. శనివారం స్థానిక పార్టీ ఆఫీసులో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కోయ రంగాపురం పంచాయతీ గుంటిమడుగు గ్రామంలో నిర్వహించే మండల మహాసభకు పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చిరంజీవి, మడకం ప్రసాద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, కారం సూరిబాబు, ఎం.గోవిందు, మురళి, దుర్గారావు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



పినపాక సమీపంలో రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

పినపాక: మండలంలోని రైతులు ఆరు కాలం పండించిన వరి ధాన్యం కుప్పలు రోడ్డుపై ఆరపోసి ప్రమాదాలకు కారణం కావద్దని ఈ.బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ అన్నారు. శనివారం పినపాకలో రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎవరు రోడ్డుపై ధాన్యం ఆరబోయకూడదని హెచ్చరించారు. వాహనదారులు కొన్ని సందర్భాల్లో చుసుకోకనో, రాత్రి వేళల్లో గమనించకనో ధాన్యం కుప్పలపైకి వాహనం పోనిచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రైతులు పోలీస్ వారికి సహకరించాలని, లేదంటే కేసులు నమోదు చేయాల్సివస్తుందని తెలిపారు.

ఇటు ఇసుక.. అటు మట్టి..

- యథేచ్ఛగా అక్రమ తోలకాలు
- అడ్డాగా మారుతున్న ములకలపల్లి



ముత్యాలంపాడు శివారులోని గుట్టను తవ్వుతున్న దృశ్యం

ములకలపల్లి: ఇసుక, మట్టి అక్రమ తోలకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. చీకటి పడితే చాలు అక్రమార్కులు రంగప్రవేశం చేసి అడ్డగోలు తరలింపునకు తెగబడుతున్నారు. గడచిన మూడు మాసాలుగా యథేచ్ఛగా మాఫియా సాగుతోంది. ఈ పరిణామాలు అక్రమ రవాణాకు ములకలపల్లి అడ్డాగా మారిందనే ఆరోపణలకు తావిస్తున్నాయి. రెవెన్యూ, పోలీస్ అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ములకలపల్లి మండల వ్యాప్తంగా విస్తారంగా వాగులున్న నేపథ్యంలో ఇసుకాసురులు ఇటు దృష్టి సారించారు. ముర్రేడు, పాములేరు వాగుల నుంచి రాత్రివేళల్లో ఇసుక తోడుతున్నారు. మండలకేంద్రంతోపాటు వీకే.రామవరం, అన్నారం, గుర్రాలకుంట, పూసుగూడెం, ఆనందపురం, సత్యంపేట, రామాంజనేయపురం తదితర గ్రామశివార్లలో ఇసుక నిలువ చేసి, లారీల్లో తరలిస్తున్నారు.

ప్రైవేట్ యార్డులు, నివాస ప్రాంతాలే అడ్డాలు..

ఇసుక అక్రమ నిల్వ కేంద్రాలు బయటకు పొక్కడంతో కొత్తమార్గాలను అన్వేషించారు. తమ అనుయాయుల ఇళ్ల వద్ద, అదేవిధంగా ప్రైవేటు వ్యక్తుల యార్డుల వద్ద అక్రమ నిల్వలకు తెరలేపారు. అనువైన సమయం చూసి పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మంతోపాటు ములకలపల్లి మండలంలోని ఏకలవ్య పాఠశాలలకు, రామచంద్రాపుర శివారులోని బ్రిడ్జ్ నిర్మాణానికి ఇసుక తోలకాలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆనందపురం శివారులోని యార్డు వద్ద ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలు, జేసీబీని సోమవారం రాత్రి టాస్క్‌పోర్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో యార్డు బాగోతం తేటతెల్లమైంది.


'గుట్ట'కాయ స్వాహా

లారీల్లో ఇసుక తరలిస్తున్న క్రమంలో స్థానిక కాంట్రాక్ట్ పనులకు ట్రాక్టర్‌లో ఎర్రమట్టి తోలుతున్నారు. ముత్యాలంపాడు గ్రామశివారులోని గుట్టను ఇష్టారీతిగా జేసీబీ సహాయంతో తవ్వి, పదుల సంఖ్యలో ట్రాక్టరల్లో నిర్దేశిత ప్రదేశానికి తరలిస్తున్నారు. ఓ వంతెన పనుల నిమిత్తం ఈదందాకు తెరలేపినట్లు తెలిసింది. ఇళ్ల ముంగిళ్లు, ఇతర స్థానిక అవసరాలకు ఓ ట్రిప్పు మట్టితోలుకుంటే వెంటనే వాలిపోయే అధికారులు భారీగా మాఫియా సాగుతున్న చోద్యం చూస్తుండడం గమనార్హం. అదేవిధంగా మూకమామిడి శివారు నుంచి అక్రమంగా మట్టి తోలకాలు సాగిస్తున్నారు. అదేవిధంగా మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలకు ఎర్ర మట్టి తరలిస్తున్నట్లు సమాచారం. సమీపంలో ప్రయివేటు వ్యక్తుల భూముల నుండి ఎటువంటి అనుమతులులేకుంగా ట్రాక్టర్లలో భారీగా మట్టి తోలుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అడపాదడపా దాడులు చేస్తున్నా..

రెవెన్యూ, పోలీస్‌శాఖలు అప్పుడప్పుడూ దాడులు చేస్తున్నా, అవి నామమాత్రంగానే సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, గత మూడు నెలల కాలంలో సంజీవ్‌పల్లి, సత్యంపేట, వేముకుంట గ్రామశివార్లలో ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి, తహసీల్ కార్యాలయానికి తరలించారు. గత నెల 7వ తేదీన వీకే. రామవరం శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని, అదేవిధంగా ఈనెల 3వ తేదీన గుర్రాలకుంట శివారు నుంచి ఇసుక తరలిస్తున్న మరో లారీని పోలీసులు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. అయినా అక్రమార్కులు నిరాటంకంగా తమ పని కొనసాగించడం అనుమానాలకు తావిస్తోంది.


అనుమతులు లేవు



ఇసుక, ఎర్రమట్టి తరలింపుకు ఎటువంటి అనుమతులు లేవు. మట్టి తవ్వకాలపై సమాచారం అందడంతో తోలకాలు నిలివేశాం. అక్రమ తోలకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గుడ్ల పుల్లారావు, తహసీల్దార్

కఠిన చర్యలు తప్పవు



అక్రమంగా ఇసుక, మట్టి తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే పలుమార్లు కేసులు నమోదు చేశాం. అక్రమ తోలకాలను నిలువరిస్తాం.

– కిన్నెర రాజశేఖర్, ఎస్సై